17వ వసంతంలోకి...
సూర్య
నేటి దినపత్రిక
ఎన్టీఆర్ - కృష్ణా
సోమవారం 19 ఆగస్టు 2024
పేజీలు 8

# నేడు రాఖీ

అన్నా,చెల్లెల అనుబంధానికి ప్రతి రూపం రక్షాబంధన్

ఈ సంవత్సరం రాఖీ ఏ సమయంలో కట్టాలి

రక్షాబంధన్ విశిష్టత ఏమిటి ?

వివరాలు 2లో..



# పుట్టగొడుగుల్లా.. బెల్టు షాపులు

- క్వార్టరుకు రూ.20 ఇస్తే తరలిపోతున్న మద్యం
- స్వాతంత్ర దినోత్సవం రోజు పదింతల మద్యం అమ్మకాలు
- ఇళ్ల మధ్య బెల్టు షాపులను తొలగించాలని కోరుతున్న మహిళలు
- ఎక్సైజ్ అధికారులు స్పందనకై ఎదురుచూస్తున్న ప్రజలు





**పెడన, ఆగస్టు 18, మేజర్ న్యూస్ :** పట్టణంలో గల్లి గల్లికి మద్యం బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుడుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల నుండి క్వార్టరుకు 20 రూపాయలు అదనంగా ఇస్తే బెల్టు షాపులకు మద్యం సీసాల కేసులకు కేసులు తరలిపోతున్నాయి. స్వాతంత్ర దినోత్సవం రోజు కూడా మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు తాళాలు వేస్తే దానికి పదింతల మద్యం అమ్మకాలు బెల్ట్ షాపులలో జరిగాయి అనడానికి అతిశ యోక్తి లేదు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో చీపులిక్కర్ క్వార్టర్ 130/- ఉంటే 20 రూపాయలు అదనముగా తీసుకుని 150 రూపాయలకు షాపుల నుండి బెల్టు షాపులకు తరలి వెళ్తున్నాయి అయితే బెల్ట్ షాపులలో క్వార్టర్ కి 40 రూపాయలు అదనముగా చేర్చి సుమారు 190 నుండి 200 వరకు అమ్ముతున్నారని మద్యపాన ప్రియులు వాపోతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కూలీ పనులు చేసుకుని బ్రతికే ఎంతోమంది సాయంత్రం అయ్యేట ప్పటికీ ఒక క్వార్టరు మందు తాగి ఆ నొప్పులు అన్ని మర్చిపోవాలి అనుకుంటే నొప్పులు మాట దేవుడెరుగు జేబులో డబ్బులు కాళీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పట్టణమనే కాకుండా మండల పరిధిలో అన్ని గ్రామ పంచాయతీల కూడలిలో కూల్ డ్రింక్ షాప్‌లలో సైతం మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఇదంతా అధికారులకు తెలియకుండానే జరుగుతుందా మిగతా 2లో...

హంసలదీవి సాగరతీరంలో...

# పర్యాటకులు గల్లంతు

ముగ్గురిని కాపాడిన మేరైన్ పోలీసులు

మృతి చెంది ఒడ్డుకు కొట్టుకు వచ్చిన యువతి

సహాయ చర్యలు వేగవంతం చేయాలి



మృతి చెందిన పజుల్లా

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కోడూరు మండలం హంసలదీవి సాగరతీరంలో ఇరువురు పర్యాటకులు గల్లంతు. గుడివాడకు చెందిన ముస్లిం కుటుంబ సభ్యులు ఆదివారం హంసలదీవి సాగరతీరానికి రాగా రెండు పెద్ద అలలు రావడంతో గుడివాడకు చెందిన ఐదుగురు సముద్రంలో మిగతా 2లో

# నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

3





# శివారుకు చేరని నీరు... రైతులు గగ్గోలు

వివరాలు 4లో...

# తీపి గుర్తులు.... చేదు బ్రతుకులు

5లో..

నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం





# స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం స్ఫూర్తిదాయకం




### చల్లపల్లిని సందర్శించిన గుంటూరు మెడికల్ కాలేజ్ 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

### హైవే వెంబడి మొక్కలు నాటిన పూర్వ విద్యార్థులు

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం స్ఫూర్తిదాయకమని గుంటూరు మెడికల్ కాలేజ్ 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అన్నారు. ఆదివారం ఉదయం గుంటూరు మెడికల్ కాలేజ్ 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థులు చల్లపల్లి గ్రామాన్ని సందర్శించారు. తమ స్నేహితులు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి ఆధ్వర్యంలో 3,207 రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారు. స్థానిక జాతీయ రహదారి-216కు ఇరువైపులా కొబ్బరి, మామిడి, ఇతర నీడనిచ్చే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గుంటూరు మెడికల్ కాలేజ్ 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, స్వచ్ఛత, సుందరీకరణకు స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి ఆధ్వర్యంలో 3,207 రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం చల్లపల్లి రూపురేఖలను సమూలంగా మార్చుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి గ్రామ ప్రజలు ఎలాంటి బాధ్యత తీసుకోవాలో చల్లపల్లి గ్రామాన్ని సందర్శించి తెలుసుకునే స్థాయిలో డీఆర్కే దంపతులు, స్వచ్ఛ కార్యకర్తల కృషి ఉందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ సంబంధిత ఫిర్యాదులను ప్రజలు ప్రధమ, జోనల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దరఖాస్తు చేసుకోగలరని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం లాగా ఈ సోమవారం కూడా విజయవాడ నగరపాలక సంస్థ ప్రధమ, విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న మూడు జోనల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నరని, ప్రజలు ఉదయం పదిగంటల నుండి తమ ఫిర్యాదులను అందజేయొచ్చని ఈ ప్రకటనలో కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభం



### జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** నేడు కలె క్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీక రించడం జరుగుతుందని జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పా టు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఇన్చార్జ్ కలెక్టర్ ప్రజలను కోరారు.



## నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి నివాళులు

**నందిగామ, ఆగస్టు 18, మేజర్ న్యూస్:** ఆజాద్ హిందూ ఫౌజ్ వ్యవస్థాపకులు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగామలో బిజెపి కార్యకర్తలు ఘనంగా చంద్రబోస్ కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొత్త సాంబశివరావు, నందిగామ ఎక్స్ కన్వీనర్ గోనెల సత్యనారాయణ, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి రావూరి రమేష్, యువనాయకురాలు గోనెల జయశ్రీ,దేవరకొండ రమాదేవి, సీనియర్ నాయకులు కటుకూరు సుందర రావు, మహంకాళి కోటేశ్వరరావు, శ్యాంసుందర్, రేళ్ల లక్ష్మణ్,రమణ తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్ వేర్ కోర్సులలో ఉచిత శిక్షణ



**గన్నవరం, ఆగస్టు 18, మేజర్ న్యూస్ :** గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ సాఫ్ట్ వేర్ డెవలపర్ కోర్సుల్లో రేపటి నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఇంటర్, డిగ్రీ పాసైన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి వెల్లించారు. శిక్షణకు సంబంధించిన రిజిస్ట్రేషన్, పూర్తి వివరాలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.

## గుండెపోటుతో పెరుమాళ్ల శివప్రసాద్ మృతి



**తిరువూరు మేజర్ న్యూస్ :** తిరువూరు పట్టణ కేంద్రంలో రాజుపేట కు చెందిన పెరుమాళ్ల శివప్రసాద్ గుండెపోటుతో ఆదివారం ఉదయం మృతి చెందారు. చిన్ననాటి బాల్యమిత్రుడు శివప్రసాద్ చనిపోయిన విషయం తెలుసుకున్న తిరువూరు వీఆర్వోలు షేక్ నాగులమీరా, పెద్ద గౌడ భాస్కర్ వారి నివాస గృహాన్ని చేరుకొని భౌతికాయంను సందర్శించి పూలమాలల వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా బాల్యమిత్రుడు కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగలేకపోవ దంతో స్నేహితుడి మీద మక్కువతో కుటుంబ పరిస్థితులు పరిశీలించి ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. చిన్ననాటి స్నేహితులను మర్చిపోకుండా స్నేహం యొక్క గొప్పతనాన్ని వారు తెలియజేయటం సంతోషించదగ్గ విషయం. బాధల్లో ఉంటే చూసి వెళ్ళిపోయే పరిస్థితిలలో కుటుంబాన్ని ఓదార్చి ఆర్థిక సాయం చేయటం కేవలం ఒక స్నేహం వల్లే జరుగుతుందని తెలుస్తుంది. విషయం తెలుసుకున్న వారు స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం అంటూ మాట్లాడటం విశేషం. ఏది ఏమైనా స్నేహితుల కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు వాళ్ళను ఆదుకున్నప్పుడే నిజమైన స్నేహం అని రుజువు చేశారు. మేమున్నామని భరోసా కల్పించడం గొప్ప విషయం.

# అమరావతిలో 'విలాసం ఎస్టేట్స్'

**విజయవాడ, ఆగస్టు 18, మేజర్ న్యూస్ :** రియల్ ఎస్టేట్ రంగంలో ప్రసిద్ధి చెందిన బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ తన తాజా ప్రాజెక్ట్ 'విలాసం ఎస్టేట్స్'ను పరిచయం చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఈ ప్రాజెక్టు పురుడుపోసుకుంటుంది. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఇటీవల అవుట్ లుక్ బిజినెస్ స్పాట్ లైట్ రియాలిటీ అవార్డు వచ్చింది. ఈ అవార్డును సినీ నటి శృతి హాసన్ చేతుల మీదుగా బీబీజీ ఫౌండర్ మల్లికార్జున రెడ్డి అందుకున్నారు. బిజినెస్ మింట్, నేషన్ వైడ్ అవార్డ్‌ల ద్వారా గుర్తింపు పొందింది, రియల్ ఎస్టేట్ రంగంలో ఆవిష్కరణ, నాణ్యతకు బీబీజీ నిబద్ధత మరోసారి నిరూపితమైంది. బీబీజీ పదిహేడు సంవత్సరాలుగా ప్లాట్లు కొనుగోలు అవకాశాలను అందించడంలో ముందంజలో ఉంది. సురక్షితమైన భవిష్యత్తు కోసం విలువైన ఆస్తులను నిర్మించడం ద్వారా కస్టమర్లకు దీర్ఘకాలిక సంపదను సృష్టిస్తుంది. భూమి పరిమిత వనరు కావడంతో ఈ వెంచర్‌లు కాలక్రమేణా స్థిరంగా విలువను పెంచుతాయి. సంపద సృష్టికి ఈ నిబద్ధత విభిన్న ప్లాట్ల పరిమాణాలలో ప్రతిబింబిస్తుంది. దీర్ఘకాలిక పెట్టుబడులకు అవకాశం ఇస్తుంది. బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ తన లాభాలలో కొంత భాగాన్ని విద్య, ఆడపిల్లల సాధికారత కోసం వినియోగిస్తుంది. ఇప్పటి వరకు దాదాపు 1.7 లక్షల మంది బాలికలకు సాధికారత కల్పించింది. 2040 నాటికి 20 లక్షల మంది బాలికలకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సేవా గుణంతో సామాజిక బాధ్యత గల సంస్థగా నిలిచింది. సమాజ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకుంది. డాక్టర్ వైవీ రావు విలాసం ఎస్టేట్స్ ద్వారా ప్రీమియం విల్లా ప్లాట్ వెంచర్, అమరావతి డైనమిక్ గ్రోత్, వ్యూహాత్మక ప్రణాళికలో రూపొందించబడింది. ఈ ప్రాజెక్ట్ 26 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. వంద శాతం వాస్తు సూత్రాలకు కట్టుబడి ఉంది. 167 ప్రణాళికాబద్ధమైన ప్లాట్‌లను అందిస్తుంది. ఉద్యానవనాలు, ఆట స్థలాలు, 40 అడుగుల కాంక్రీట్ రోడ్‌లను కలిగి ఉంది. శక్తివంతమైన కమ్యూనిటీ స్పష్టంగా కనిపిస్తుంది. రౌండ్-ది-క్లాక్ సెక్యూరిటీ, సీసీటీవీ నిఘా, సోలార్ ఫెన్సింగ్‌తో సహా ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి పటిష్టంగా ఉంది. ఈ ప్రాజెక్ట్ ప్రధానంగా కొండపల్లి - అమరావతిని కలిపే రాబోయే ఐకానిక్ వంతెనతో కనెక్టివిటీని కలిగి ఉంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, కొండపల్లి జలపాతాలు, నిర్మా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వంటి విద్యా సంస్థలు, ప్రధాన వాణిజ్య మండలాలు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి కీలక ప్రదేశాలకు సమీపంలో ఉండటం దీని ప్రత్యేకత. అమరావతి రాజకీయ, పరిపాలనా కేంద్రంగా మాత్రమే కాకుండా చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన నగరం. పురాతన బౌద్ధ అవశేషాలకు ప్రసిద్ధి చెందింది. ప్రాచీన భారతదేశంలో అభ్యాస కేంద్రంగా, అమరావతి చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు, పర్యాటకులను ఆకర్షిస్తున్న గొప్ప వారసత్వాన్ని కలిగి ఉంది. నగరం ఆధునిక అవస్థాపన అభివృద్ధి, సాంస్కృతిక వారసత్వంతో కలిపి ఉంది. ఇది పెట్టుబడి పెట్టడానికి ఒక ప్రత్యేకమైన ప్రదేశం. నివసించడానికి ఎంతో అనువైన ప్రదేశం కూడా. కొండపల్లి బొమ్మలకు ప్రసిద్ధి చెందింది. ఇది స్థానిక శోభను పెంచుతుంది. ఈ కోట మధ్యయుగ వాస్తుశిల్పానికి నిదర్శనం. సుందరమైన కొండపల్లి కొండలు సుందరమైన అందాన్ని, చరిత్ర స్పర్శను అందిస్తాయి. వారసత్వం, ఆధునికత ఈ సమ్మేళనం సమతుల్య జీవనశైలిని కోరుకునే నివాసితులకు అమరావతి ఉత్తమ ఎంపిక అవుతుంది. దీంతో పెట్టుబడిదారులు, గృహయజమానులు ఆశాజనకమైన రాబడికి ఆకర్షితులవుతారు. ఐదు వందల శాతం ఆర్ఓఐ అమరావతి బలమైన ఆర్థిక వృద్ధి, అభివృద్ధి పథాన్ని ప్రతిబింబిస్తుంది. అభివృద్ధి చెందుతున్న మహానగరంలో తమ భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకోవాలని చూస్తున్న వారికి విలాసం ఎస్టేట్‌లను ఆకర్షణీయమైన ఎంపికగా మార్చింది. బీబీజీ అమరావతిలోకి విస్తరించడం అనేది నివాస స్థలాలను సృష్టించడం మాత్రమే కాకుండా.. ఉన్నతమైన జీవనశైలిని అందించే కమ్యూనిటీలను నిర్మించడం ముఖ్యం. అమరావతి ఒక ముఖ్యమైన పట్టణ కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నందున విలాసం ఎస్టేట్స్ వంటి ప్రాజెక్టులు దూరదృష్టితో కూడిన రియల్ ఎస్టేట్ అభివృద్ధి పరివర్తన సామర్థ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది.

## ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా రామ్మూర్తి నాయుడు

**కృత్తివెన్ను ఆగస్టు 18 మేజర్ న్యూస్ :** పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన సేవసంస్థలు నిర్వహించే పలు సేవా కార్యక్రమాలకు ఉమ్మడి కృష్ణాజిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా కృత్తివెన్ను మండలం చినపాండ్రాక గ్రామానికి చెందిన వాలిశెట్టి రామ్మూర్తి నాయుడును నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం అఖిలభారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షులు రమణం స్వామి నాయుడు ఆదేశాల ప్రకారం ఈ నియమకాం చేపట్టినట్లు తెలిపారు. రామ్మూర్తి నాయుడికి ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా ఎంపిక చేయడం పట్ల కృత్తివెన్ను మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రత్తయ్య శుభాకాంక్షలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో మరిన్ని సేవా కార్యక్రమాలు చిరంజీవి సేవా సంస్థల ద్వారా నిర్వహించేందుకు తోడ్పాటు అందించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.







# శివారుకు చేరని నీరు... రైతులు గగ్గోలు

## అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని రైతులు వినతి

**కృత్తివెన్ను ఆగస్టు 18 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని శివారు రైతులకు సాగునీరు అందక ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాకే శివారు మండల మైన కృత్తివెన్ను ప్రాంత రైతులకు సాగునీరు అందక గగ్గోలు పెడుతున్నారు. గరిశపూడి నుంచి పడతడికి వరకు ఉన్న పంట కాలువకు నీరు సరిగా చేర కపోవడంతో రైతులు నారువేసి ఇబ్బందులు పడుతున్నారు. పొలాలు బీడుగ మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలవ చెత్తాచెదారాల తో నిండిపోయి అరాకొరాగా వస్తున్న నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడంతో శివారు రైతులకు నీరు రావడంలేదని వాపోతున్నారు. అధికారుల దృష్టికి ఎన్ని సార్లు సమస్యను తీసుకువెళ్లిన స్పందించిన నాధుడే లేదని ఆవేదన చెందు తున్నారు. రైతులే స్వయంగా కూలీలను పెట్టుకుని కాలువను బాగు చేయించు కోవడం చూస్తుంటే రైతుల దీనస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుంది. విస్తా రంగా వర్షాలు వస్తున్నాయని నీటి కొరత ఉండదని ఆశతో రైతులు నారు ము దులు వేశారు తీర చూస్తే ఎండలు మండుతున్నాయి కాలువకు నీరు అరా కొరగా వస్తుంది చివరకు నీరు రావడం లేదు వేసిన నారు ఎండిపోతుండ డంతో రైతులు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మ మ్ములను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకా శం బ్యారేజ్ వద్ద వచ్చిన వరద నీటిని సముద్రపాలు చేశారని తీరా ఇక్కడ చూ స్తే ప్రధాన పంట కాలువకే పూర్తిస్థాయిలో నీరు రావడంలేదని ఇక చిన్న కా లువలకు నీరు ఎలా వస్తుందంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే రైతులు ఆర్థికం గా ఎంతో ఇబ్బందులకు గురయ్యారని వ్యవసాయంపై అధిక ఖర్చులు పెరిగి పోతున్నాయని దేనికితోడు ఆయిల్ ఇంజన్ లతో నీటిని తోడు కోవడం రైతుకు మరింత ఆర్థిక భారాన్ని పెంచుతుందన్నారు. స్థానిక శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి కాల్వ పనులు చేయించి పూర్తిస్థాయిలో నీటి విడుదల జరిగేలా చూడాలని కోరుతున్నారు.

# ఐవీఎం సురేష్ ధన్యజీవి



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** ఆర్తజనుల కన్నీళ్లు తుడవటమే తన జీవిత ధ్యేయంగా సమాజ సేవ చేస్తున్న ఐవీఎం సురేష్ ధన్యజీవి అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం పురిటి గడ్డలోని ఐవీఎం హోంలో ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ - రోజా దంపతుల ఆధ్వర్యం లో రూ.40లక్షలు వ్యయంతో 233 మంది ప్రతిభావం తులైన పేద విద్యార్థులకు స్కాలర్ షిప్స్, బీ.టెక్ విద్యా ర్థులకు లాప్ టాప్స్ పంపిణీ, స్కూల్, కాలేజ్ విద్యార్థులకు ఫీజులు సహాయంగా అందించే కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో దశాబ్దాలుగా విస్తృత స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏకైక సంస్థ ఐవీఎం అన్నారు. అనాధలకు, పేదలకు కల్పతరువుగా ఐవీఎం సంస్థ నిలుస్తోందన్నారు. పేద విద్యార్థులకు విద్య, వైద్యంతో పాటు ఆర్థిక ఇబ్బం దుల్లో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారన్నారు. అనాధ లను కన్నబిడ్డలతో సమానంగా చూసుకుంటూ ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్న తీరు ప్రశం సనీయమన్నారు. అన్ని వర్గాల వారికి సహాయం అందిస్తున్న డాక్టర్ సురేష్ కరోనా సమయంలో నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది పేద కుటుంబాలకు, ఫ్రంట్ లైన్ వారియర్లకు సహాయం చేశారన్నారు. ఐవీఎం సహాయం తో చదువుకుంటున్న పేద విద్యా ర్థులు ఉన్న త శిఖరాలు అందుకోవాలన్నారు. నియోజక వర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా విస్తృత సమాజ సేవ చేస్తున్న ఐవీఎం సురేష్ మరెన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహిం చాలని ఆకాం క్షించారు. అనాధ, పేద విద్యార్థుల జీవితాలు తీర్చిదిద్దు తున్న డాక్టర్ సురేష్ స్ఫూర్తిదాయక సామాజిక సేవలు చేస్తున్నారన్నారు. ఐవీఎం ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వేములపల్లి సురేష్ మాట్లాడుతూ 23 సంవత్సరాల నుం డి తమ హోమ్ ద్వారా వందలాది మంది విద్యార్థులు గ్రా డ్యుయేట్లు అయ్యారన్నారు. ప్రతి నెల 94 మంది పేద వృ ద్ధులకు, వితంతువులకు వస్త్రదానం, నెలవారీ సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. ఇంకా మరెన్నో సేవలు సమాజం అవసరాలు గుర్తించి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ పేద విద్యార్థులకు ఐవీఎం స్కాలర్ షిప్స్, లాప్ టాప్స్ అందచేశారు. కార్యక్రమంలో కాకినాడ ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఎన్.ఎస్.వీ.కే.దుర్గారావు, ఐవీఎం బోర్డు సభ్యులు ఎన్.ఫణి, జీ.ప్రసాద్, విశ్రాంత డీఎస్పీ కే.హరి రాజేంద్రప్రసాద్, ప్రముఖులు యార్లగడ్డ శ్రీనివా సరావు, చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్, పురిటిగడ్డ మాజీ సర్పంచ్ పరుచూరి వెంకటేశ్వరరావు, మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలి








జగ్గయ్యపేట ఆగస్టు 18, మేజర్ న్యూస్ : పట్టణంలో గెంటేల వెంకట జోగయ్య జిల్లా పరిషత్ పాఠశాలలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో ఆస్టర్ రమేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ విజయవాడ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీరాం తాతయ్య వైద్యులు, నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ విజయవాడ ప్రముఖ వైద్యులు రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సూచించారు. విజయవాడతో పాటు గుంటూరు వంటి ప్రాంతాల్లో కూడా రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గతంలో జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రిలో టెలీ మెడిసిన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా జగ్గయ్యపేట పట్టణంలో ఒక ఆసుపత్రిని ఏర్పాటు చేశారని దాని ద్వారా గుండె, క్యాన్సర్ ఆర్థోపెడిక్, నరాలు జనరల్ వంటి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. జగ్గయ్యపేటలో రమేష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నడుస్తున్న వైద్య సేవలను మరింత విస్తృతంగా అందించే విధంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జగ్గయ్యపేటలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో మందులు అందజేయడంతో పాటు మరింత మెరుగైన వైద్యం కోసం విజయవాడ వెళ్లే విధంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కంచేటి గీతారాణి,పేరం సైదేశ్వర రావు,గొట్టే నాగరాజు, కటికల అనిల్, మారేపల్లి శౌరి, బండ్ల జ్ఞాన్ ప్రకాష్, పితాని శ్రీనాథ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తీపి గుర్తులు.....చేదు బ్రతుకులు

## నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం












**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఫోటోగ్రఫీ అనేది గ్రీకు పదం నుండి వచ్చింది. ఫోటో అంటే కాంతి, గ్రాఫి అంటే తీసుకోవడం. కాంతితో చిత్రీకరించే దానినే ఫోటోగ్రఫీ అంటారు. ప్రపంచ ఫోటో దినోత్సవాన్ని 19 ఆగష్టు 1910 న మొదటగా జరుపుకున్నారు. ఫోటోగ్రఫీ దినోత్సవం డాగ్యురో అనే శాస్త్రవేత్త ఆవిష్కరణల నుండి ఉద్భవించింది. ఫ్రెంచ్ దేశానికి చెందిన లూయిస్ డాగ్యురే, జోసెఫ్ నైసోఫోర్ నీప్స్ అభివృద్ధి చేసిన ఫోటోగ్రఫీ ప్రక్రియల గురించి 1839 జనవరి 9న ఫెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ డాగ్యూరే టైప్ ప్రాసెస్ను అధికారికంగా ప్రకటించింది. తర్వాత కొద్ది నెలలకు 1839 ఆగష్టు 19 న ఫ్రాన్స్ ప్రభుత్వం ఫోటోగ్రఫీపై పెటెంట్ హక్కులను కొనుగోలు చేసి దానిని ప్రపంచానికి ఉచిత బహుమతిగా అందించింది. అందుకే ఏటా ఆగష్టు 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంగా జరుపుతున్నారు. ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం ఆగష్టు 19న ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫోటోగ్రాఫర్లను ఏకం చేయడానికి మరింత మందిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగష్టు 19న ప్రపంచ స్థాయిలో జరుపుకుంటారు. అందరికి తీపి గుర్తులను అందచేసే ఫోటోగ్రాఫర్ల బ్రతుకులు మాత్రం చేదుగానే మిగిలిపోతున్నాయి.

**టెక్నాలజీతో పోటీ పడలేక కుదేలవుతున్న గ్రామీణ ఫోటోగ్రాఫర్లు :**

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వేగంగా మార్పు చెందని గ్రామీణ ఫోటోగ్రాఫర్ల జీవితాలు మసకబారుతున్నాయి. గత 30-40 ఏళ్లగా ఫోటోగ్రఫీనే జీవనాధారం చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో ఫోటో స్టూడియోలు నడుపుకుంటున్న ఛాయాచిత్రకారుల పరిస్థితి నేడు చాలా దయనీయంగా తయారయింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డిజిటల్ కెమెరాల ధరలు లక్షల్లో ఉండడం, స్టూడియోలలో ఫోటోలు దిగే వారి సంఖ్య గణనీయంగా తగ్గడం వృత్తి ఫోటోగ్రాఫర్ల పాలిట శాపంగా మారింది. జీవితంలో ఫోటోగ్రఫీ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉండటంతో పాటు వృత్తి ఫోటోగ్రాఫర్ల జీవన గమ్యాన్ని నిర్ధేశిస్తోంది. సామాన్య వర్గాల నుంచి మేధావి వర్గం వరకు ప్రతి ఒక్కరూ ఏదో సందర్భంలో ఫోటోగ్రఫీతో అనుబంధం ఏర్పరచుకోక తప్పడం లేదు. అందుకే అనాదిగా జవనోపాధి కోసం వేలాది మంది ఫోటోగ్రఫీని వృత్తిగా స్వీకరించి స్వయం ఉపాధి మార్గమైన వృత్తి ఫోటో గ్రాఫర్లు జీవిస్తున్నారు. తొలుత అద్భుత కళానైపుణ్యతతో కూడిన చేతి వృత్తిగా జీవనమైన ఫోటోగ్రఫీలో అత్యాధునిక పరిజ్ఞానం, కంప్యూటర్ల వ్యవస్థ ప్రవేశించడంతో ప్రస్తుతం అదే జీవనోపాధిగా ఉన్న వృత్తి ఫోటోగ్రాఫర్ల జీవన దృశ్యం మనసబారుతుందని ఈ వర్గాల్లో ఆందోళన చెలరేగింది. గత కొన్నేళ్ళుగా డిజిటల్ ఫోటోగ్రాఫి రాజ్యం ఏళడంతో వృత్తి రహస్యం మృగ్యమై వృత్తి నైపుణ్యం కొరవడి కేవలం టెక్నాలజీపై ఆధారపడటంతో ఫోటోగ్రఫీ జీవనం చిన్నాభిన్నం అయ్యిందని పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రంగాల్లో రాజ్యమేలుతున్న కార్పోరేట్ విధానం, డిజిటల్ టెక్నాలజీ అత్యాధునిక హెడ్‌డి, మిర్రర్ లెస్ కెమెరాల ప్రవేశంతో శ్రమ తగ్గి ఆర్థిక వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. టెక్నాలజీ అభివృద్ధి చెంది, ఆటోఫోకస్ కెమోరాలు అందుబాటు లోనికి రావడంతో ఎంతో యువకులు ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లుగా మారడంతో తమ జీవన గమ్యం గతుకుల మయంగా మారిందని వృత్తి ఫోటోగ్రాఫర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నానాటికి పెరుగుతున్న కెమోరాల ధరలు ఫోటో మెటిరియల్ వ్యయం, అద్దె, నిర్వాహన ఖర్చులతో అంతంతమాత్రంగానే జీవనోపాధి కల్పిస్తున్న వృత్తి ఫోటోగ్రాఫర్లకు సెల్‌ఫోన్ రూపంలో కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. ప్రస్తుతం ఫోటో స్టూడియోలు కేవలం పాస్‌సైజ్ ఫోటోలకు మాత్రమే ఉపయోగడపతున్నాయని సీనియర్ ఫోటోగ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చిత్రాలయ శ్రీనివాసరావు, కోడూరు



లతా మోహన్, నాగాయలంక



అంజలి శంకర్, మోపిదేవి




స్టూడియోలో ఫోటోలు తీయించుకునే వారి సంఖ్య కనుమరుగై కేవలం పాస్‌సైజ్ ఫోటోలకే పరిమితం అవ్వడంతో ఆర్థిక భారంతో వృత్తి ఫోటోగ్రాఫర్లు కొట్టుమిట్టాడుతున్నారు. ఆధునిక యుగంలో ఫోటోగ్రఫి అనేక రూపాంతరాలు చెంది. నేడు డిజిటల్ టెక్నాలజీ, కంప్యూటర్లపై ఆధారపడి వృత్తి నైపుణ్యం చూపించే అవకాశం లేకుండా పోయింది. నైతిక విలువలు పాటించక, ధరలు విషయంలో పోటీతత్వం ప్రబలడం వంటి అంశాలతో వృత్తి ఫోటోగ్రాఫర్ల మనుగడ కష్టంగా మారింది. ఓ అద్భుతమైన కళ గా ఎందరో జీవనోపాధికి కేంద్ర బిందువుగా నడుపుతున్న వృత్తి ఫోటోగ్రాఫర్ల పట్ల అటు ప్రభుత్వం, ఇటు ప్రజలు చిన్న చూపు చూస్తే వారి జీవన దృశ్యం కనుమరుగు కాక తప్పదు.

**కెమెరా ధరలు అధికం.... ఆదాయం అంతంతమాత్రం**

**చిత్రాలయ శ్రీనివాసరావు, కోడూరు**

ఆధునిక ఫోటోగ్రఫీ రంగంలో వచ్చిన పెనుమార్పుల కారణంగా ఫోటోగ్రఫీనే జీవనాధారంగా చేసుకుని స్టూడియోలు నడుపుతున్న వారి పరిస్థితి అద్వానంగా ఉంది. డిజిటల్ కెమెరాల ఆవిర్భావంతో కెమెరా ధరలు లక్షల్లో పెరిగి స్టూడియోల నిర్వహణ కష్టంగా మారింది. ప్రస్తుతం ఫోటోగ్రఫీ రంగంలో ఫోటో గ్రాఫర్లు నైతిక విలువలు పాటించక ధరల విషయంలో పోటీపడుతూ ఉండడంతో వృత్తి ఫోటోగ్రాఫర్లు గౌరవం కోల్పోతున్నారు.

**ఈవెంట్ ఫోటోగ్రఫీకి పెరుగుతున్న ఆదరణ**

**: లతా మోహన్, నాగాయలంక**

ఈ మధ్యకాలంలో ఈవెంట్ ఫోటోగ్రఫీకి విపరీతమైన ఆదరణ దక్కుతుంది. 30 ఏళ్ళ క్రితం ఒక పెళ్ళికి ఒక రీల్ అంటే 35 ఫోటో మాత్రమే తీయించుకునేవారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఒక పెళ్ళికి ఫోటో, విడియోలకు 3 లక్షల వరకు ఖర్చు పెడుతున్నారు. కాలానుగుణంగా మారిన ఫోటోగ్రాఫర్ల పరిస్థితి మెరుగ్గా ఉన్నప్పటికి ఫోటోగ్రాఫీనే వృత్తిగా ఫోటోస్టూడియోలను నడుపుతున్న నాలాంటి వారి పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందని సీనియర్ ఫోటోగ్రాఫర్ లతామోహన్ అన్నారు.

**భారంగా మారుతున్న స్టూడియోల నిర్వాహణ**

**అంజలి శంకరరావు, మోపిదేవి**

నూతన టెక్నాలజీ ప్రవేశంతో స్టూడియోల నిర్వాహణ భారంగా మారింది. డార్క్ రూమ్‌ల స్థానంలో లక్షల పెట్టుబడితో కూడిన కంప్యూటర్లు ప్రవేశించడంతో స్టూడియోల నిర్వాహణ అత్యంత భారంగా మారిందని సీనియర్ ఫోటోగ్రాఫర్ అంజలి శంకరరావు వాపోయారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసుకున్న చిన్నపాటి స్టూడియోల నిర్వాహణ చాలా కష్టతరంగా మారింది. స్టూడియోలో ఫోటోలు దిగేవారు కరువైయ్యారు. ఒకప్పుడు చిన్నపిల్లలను స్టూడియోలో చెక్కగుర్రంపై ఫోటో తీయించుకోవడం ఒక ఫ్యాషన్‌గా ఉండేదని, సెల్‌ఫోన్‌ల ప్రవేశంతో పిల్లలను స్టూడియోకు తీసుకురావడమే నేడు కరువైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# పోలీస్ సేవా పథకం గ్రహీతకు హర్షం వ్యక్తం చేసిన కానుమోలు గ్రామస్తులు





**హనుమాన్ జంక్షన్, ఆగస్ట్ 18, మేజర్ న్యూస్ :** 78 వ స్వాతంత్ర్య స్వాతంత్ర్యదినోత్సవం పురస్కరించుకొని నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో లో జరిగిన వేడుకల్లో బాపుల పాదు మండలం కానుమోలు గ్రామానికి చెందిన పోలీస్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న నెల్లూరు జిల్లా పోలీస్ లైజి నింగ్ ఆఫీసర్ బోర వెంకట వినోద్ కుమార్ కు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన ఉత్తమ పోలీస్ సేవా పథకంతో పాటు క్యాష్ అవార్డును రివార్డ్ ను అందుకున్నారు. ప్రజలకు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత వినోద్ కుమార్ మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడం, నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ సమక్షంలో సేవా పథకం అందుకోవటం ఆనందంగా ఉందని వినోద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బంధు మిత్రులు, కుటుంబ సభ్యులు వినోద్ కుమార్ ను అభినందించారు.



## జనం కోసం జనసైనికుల సేవా కార్యక్రమం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** జనం కోసం జనసైనికులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అవనిగడ్డ నుండి కొత్తపేట సివారు తిప్పాలెం వరకు పిచ్చి మొక్కలకు కలుపు మందు పిచికారి చేయించారు. ఆదివారం అవనిగడ్డ సివారు సాయిబాబా గుడి వద్ద నుండి కొత్తపేట, దళితవాడ, తిప్పాలెం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా పిచ్చమొక్కలు ఏపుగా పెరిగి చెత్తాచెదారం నిండిపోవడంతో ఎదరెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో అవనిగడ్డ జనసైనికుల ఆధ్వర్యంలో కలుపు మందు పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

## శారద మృతదేహానికి మండలి నివాళ్ళు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డలో కాంట్రాక్టర్గా పేరొందిన మండలి లక్ష్మణరావు సతీమణి శారద మృతి చెందడంతో ఆదివారం ఉదయం శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ శారద మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించారు. అనంతరం లక్ష్మణరావును పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలి వెంట గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి రాజా, పులిగడ్డ గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు అండగా టీడీపీ నేతలు



**మచిలీపట్నం, మేజర్న్యూస్ :** అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి అండగా నిలవాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు వితరణ అందించిన టీడీపీ నేత గుమ్మడి అశ్విని. బుధవారం అర్ధరాత్రి రుద్రవరం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో నిలిచిన కుటుంబానికి చలించిన టీడీపీ నేత అశ్విని సంఘటన సమాచారాన్ని మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి కుటుంబానికి అండగా నిలవాలని ఆదేశించగా పార్టీ ఆదేశాల మేరకు కుటుంబాన్ని పరామర్శించి పరిస్థితిని తెలుసుకొని నిత్యావసర సరుకులు అందించారు. ఏ సహాయం కావాలన్న అండగా ఉంటానని, అందుబాటులో హామీ అందించడంతో అశ్వినికి గ్రామంలోని సీనియర్ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నేతలు మాజీ సర్పంచ్ నీలం వెంకట రామకృష్ణ, గుమ్మడి కిరణ్ కుమార్, గోట్రు. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ వేలం

**మచిలీపట్నం, మేజర్న్యూస్ :** కృష్ణాజిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్ మచిలీపట్నంలో ది.20.08.2024 ఉదయం 10 గంటలకు పోలీసు వాహనముల మరమ్మత్తుల అనంతరము, వాహనాలనుండి తీసివేయబడిన విడిభాగములు బహిరంగ వేలం వేయబడును. మచిలీపట్నం పరిసర ప్రాంత ఆసక్తికర బిడ్డర్లు ఉదయం 10 గంటలకు పోలీసు పరేడ్ గ్రౌండ్ కు హాజరు కాగలరని తెలియజేయడమైనది అని ఒక ప్రకటనలో తెలియజేయడమైనది.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**పెదన, ఆగస్టు 18,మేజర్ న్యూస్ :** గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పట్టణంలో గల తోటమూల నుండి గుడివాడ వెళ్లే బైపాస్ రోడ్ లో సుమారు 60 సంవత్సరాల వయసు గల ఒక వ్యక్తి మృతదేహం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.దీనితో సంఘటన స్థలానికి ఎస్సై తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. మృతదేహం పూర్తిగా తల నుండి ఛాతి భాగం వరకు పూర్తిగా దెబ్బతిని నుజ్జు నుజ్జు కావడంతో ఆ వ్యక్తి ఎవరో అనేది గుర్తుపట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.ఈ ప్రమాదం ఆదివారం తెల్లవారుజామున సుమారు 5 నుండి 6 గంటల సమయంలో జరిగి ఉండొచ్చని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరుపుతామని పేర్కొన్నారు. మృతుడు తెల్లటి గడ్డంతో ఆకుపచ్చ రంగు గళ్ళ లుంగి, కాకి రంగు చొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు.ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీస్ స్టేషన్లో వెంటనే తెలియపరచాలని ఎస్సై కోరారు.మృతదేహాన్ని పంచనామా నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చరీలో భద్రపరిచామని అన్నారు.

## శ్రమదానం చేసిన గన్నవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది



**గన్నవరం, ఆగస్టు 18, మేజర్ న్యూస్ :** గన్నవరం పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త తొలగింపు కార్యక్రమాన్ని వ్యాయా మంగా భావించి శుభ్రం చేశామన్నారు. ప్రతి ఒక్కరు వారి వారి కార్యాలయాల్లో కొంచెం సమయం కేటాయిస్తే ఆరోగ్యం, పరిశుభ్రత ఉంటుందని తెలిపారు.

## లింగన్న కోడులో గల్లంతైన వ్యక్తి మృతి



**కోడూరు, మేజర్ న్యూస్ :** లింగన్నకోడు మురుగు కాలవలో గల్లంతయి వ్యక్తి మృతి చెందిన సంఘటన కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. శనివారం గ్రామానికి చెందిన మాచర్ల బిన్ను (58) పశువులను కడిగేందుకు మురుగు కాలవలోకి దిగగా నీటి ప్రవాహానికి చేతిలో ఉన్న ముళ్ళు కర్ర జారిపోవడంతో దానిని పట్టుకునే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఆదివారం ఉదయానికి అతని మృతదేహం లభ్యం అయింది. ఈ విషయంపై మృతుని భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టార్టం అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు కోడూరు ఎస్సై పి శిరీష తెలిపారు.

## తుమ్మల సత్య వైద్య ఖర్చులకు కమ్మవారి ఐక్య సేవా సమితి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సహాయం అందజేత



**హనుమాన్ జంక్షన్, ఆగస్టు 18, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన తుమ్మల సత్యనారాయణ (తుమ్మల సత్య) చాలా కాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వైద్యానికి 50 లక్షల రూపాయలు వరకు ఖర్చు అవుతుందని ఆర్థిక సహాయం అందించవలసిందిగా కమ్మవారి ఐక్య సేవా సమితి ఆంధ్రప్రదేశ్ కార్యవర్గానికి విజ్ఞప్తి చేశారు. తక్షణమే స్పందించిన వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరి రామకృష్ణ దాతల సహకారంతో 50336 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. సమితి కార్యవర్గ సభ్యులు పరుచూరి ప్రసాద్, కమ్మదర్శిని వ్యవస్థాపకులు ఉప్పలపాటి ప్రవీణ్, తుమ్మల సత్యనారాయణ ఇంటికి స్వయంగా వెళ్లి చెక్కు అందజేయడం జరిగింది.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



**తిరువూరు మేజర్ న్యూస్:** పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు తిరువూరు మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పరిధిలోని వావిలాల గ్రామ డిస్పెన్సరీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ టి శ్వేత తెలిపారు. పశువుల నోరు, కాలిగిట్టల మధ్య పుండ్లు రావడం, తీవ్రమైన జ్వరం ఉండడం గాలికుంటు వ్యాధి లక్షణమన్నారు. ఈ వ్యాధి సోకిన పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందని, అందుకే వ్యాధి వచ్చిన తర్వాత వైద్యం చేయించుకోవడం కంటే ముందుగానే నివారణ టీకాలు వేయించాలని ఆమె సూచించారు. ఈ నెల 20 న మండల పరిధిలోని మల్లేల గ్రామంలో ఉదయం 7 గంటల నుంచి 10:30 వరకు పశువులకు టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభమవుతుందని, రైతులు తమ పశువులను ఇంటి వద్ద ఉంచాలని ఆమె కోరారు.

## విద్యార్థులకు ఉచిత గొడుగులు పంపిణీ



**తిరువూరు మేజర్ న్యూస్:** ఎండా, వాన ల నుండి రక్షణ కొరకు స్థానిక ఐడియాస్ స్వచ్ఛంద సంస్థలో పేద విద్యార్థిని, విద్యార్థులకు కీ.శే. కోరుకొండ పద్మావతి జ్ఞాపకార్థం వారి కుమార్తె, అల్లుడు పసుమర్తి వెంకటరమణ కుమారి, పసుమర్తి వెంకటేశ్వరరావు వితరణతో ఆదివారం ఉచిత గొడుగుల పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు పసుమర్తి వెంకటేశ్వరరావు, కంచర్ల ముత్య ప్రసాద్, బొడ్డు ప్రకాశరావు, సంకురాత్రి జనార్ధన రావు, అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు, కొమ్మినేని రాజేష్ ఖన్నా, నాగు బండి ప్రకాష్ రావు, గుండా రంగారావు, నూతక్కి రాఘవరావు, కోరుకొండ గంగాధర్ రావు, నాళ్ళా రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

# శృంగేరీ చేరుకున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదివారం ఉదయం శృంగేరీ చేరుకొన్నారు. మొట్టమొదట శృంగేరీలో కొలువై ఉన్న శ్రీ శారదా అమ్మవారి దేవాలయాన్ని, ఇతర దేవతా సన్నిధులను దర్శించుకుని నరసింహవనంలో చాతుర్మాస్య దీక్షలో ఉన్న ఉభయ జగద్గురువులను దర్శించుకున్నారు. మొదట జగద్గురు భారతీతీర్థ మహాస్వామివారిని దర్శించుకుని వారి ఆశీస్సులు పొందారు. తదనంతరం జగద్గురు విధుశేఖరభారతీ మహాస్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక మొట్టమొదటగా దక్షిణామ్నాయ శృంగేరీ శారదాపీఠాన్ని సందర్శించి రాష్ట్ర పరిపాలన అభివృద్ధి కార్యక్రమాలకు జగద్గురువుల మార్గదర్శకాలను, ఆశీరనుగ్రహాన్ని పొందటానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రార్థనా సందేశాన్ని కూడా విన్నవించటానికి తాము వచ్చినట్టు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామివారికి తెలియజేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి తమ ఆశీస్సులు మార్గదర్శకత్వము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని, ధర్మ బద్ధంగా ప్రజలకు మేలు కలిగేలా సత్పరిపాలన అందించటానికి ప్రభుత్వం కృషి చేయాలని శ్రీ స్వామివారు ఆశీర్వదించారు. 2018వ సంవత్సరం మార్చి నెలలో తమ ఆంధ్రప్రదేశ్ విజయయాత్రలో భాగంగా విజయవాడలో ఉన్నప్పుడు అప్పుడు కూడా ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు తమను సందర్శించినట్టు, తరువాత ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో తాము కూడా సందర్శించి ఆశీర్వదించినట్టు విధుశేఖరభారతీ మహాస్వామి వారు గుర్తు చేసుకున్నారు.


# 'గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్' గా ఆంధ్రప్రదేశ్ కు అవార్డు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** తమిళనాడు కోయంబత్తూర్ వేదికగా జరిగిన ఇండియన్ విండ్ పవర్ అసోషియేషన్ మీటింగ్ లో ఆంధ్రప్రదేశ్ కీలక అవార్డ్ ను సొంతం చేసుకుంది. 2023-24 ఏడాదికి సంబంధించి ఏపీని 'గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్' గా ఇండియన్ విండ్ పవర్ అసోషియేషన్ గుర్తించింది. ఈ మేరకు అవార్డ్ ను ప్రకటించింది. ఈ అవార్డ్ ను విండ్ ఎనర్జీ జాయింట్ సెక్రటరీ లలిత్ బోరా గారి చేతుల మీదుగా ఎండీ, సీఈవో, ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ డా. ఎం. కమలాకర్ బాబు అందుకున్నారు. ఈ అవార్డ్ కోసం మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాలు పోటీపడ్డాయి. అవార్డ్ అందుకున్న అనంతరం ఎండీ కమలాకర్ బాబు మాట్లాడారు... 2014-19 మధ్య కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెన్యూవబుల్ ఎనర్జీకి ఇచ్చిన ప్రాధాన్యతే ఆంధ్రప్రదేశ్ ను గ్రీన్ ఎనర్జీ ఛాంపియన్ గా నిలబెట్టినట్లు కమలాకర్ బాబు పేర్కొన్నారు. గతంలో సీఎం తీసుకున్న చొరవతోనే ఈ ఫలితాలను ఏపీ పొందుతుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ మిగత రాష్ట్రాలతో పోల్చితే రెన్యువబుల్ ఎనర్జీకి పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఏపీ న్యూ రెన్యువబుల్ ఎనర్జీకి అవార్డ్ రావడం పట్ల విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలకు ప్రస్తుతం సత్ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీకి ఏపీ పెద్దపీట వేస్తుందని తెలిపారు.

# కష్టపడి పని చేస్తే ప్రతిఫలం దానంతట అదే వస్తోంది

## పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వై.వి.బి. రాజేంద్రప్రసాద్



**ఉయ్యూరు, మేజర్ న్యూస్ :** ఉయ్యూరులోని రాజేంద్రప్రసాద్ కార్యాలయంకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావునీ (ఖమ్మం జిల్లా), తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ మెంబర్, తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డిని (రంగారెడ్డి జిల్లా), చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పోటీ చేసిన భీం భరత్‌నీ (రంగారెడ్డి జిల్లా), తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ గౌరవ అధ్యక్షులు పుసులూరి నరేంద్రనీ (ఖమ్మం జిల్లా) శాలువా, పూలమాలలతో సత్కరించి రాజేంద్రప్రసాద్ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ లో పనిచేసి రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ గా రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ మెంబర్‌గా నామినేటెడ్ చేయబడిన చింపుల సత్యనారాయణ రెడ్డి ఇటీవల నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టి ప్రప్రదమంగ ఉయ్యూరు వచ్చిన సందర్భంగా వారిని సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాల్లో అయినా, వ్యాపారంలోనైనా చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే ప్రతిఫలం తనంతట అదే వస్తుందని, దానిలో భాగంగానే తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్గా రాయల నాగేశ్వరరావుకి ఎన్నుకోవడం జరిగిందని, అలాగే యువత రాజకీయాల్లోకి వచ్చి సమాజానికి మంచి సేవ చేస్తూ భవిష్యత్ తరాలకు దిక్సూచిగా ఉండాలని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర సగరసాధికార కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణి, యూనిట్ ఇంచార్జ్ చలపతి శ్రీను, బూత్ ఇంచార్జ్ రామనోళ్ళ శ్రీకాంత్, నరసింహారావు, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.



## వైద్య శిబిరానికి 1000 మంది హాజరు



**తిరువూరు మేజర్ న్యూస్:** జనవిజ్ఞాన వేదిక తిరువూరు వారి ఆధ్వర్యంలో గత 11 సం.లుగా నాగార్జున పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరా నికి ఆదివారం తిరువూరు, పరిసర జిల్లాలైన కృష్ణా, ఖమ్మం జిల్లాలనుండి కూడా 1000 మంది హాజరయ్యారు. వీరికి కేవలం రూ.200 లకే రెండు నెలలకు సరిపడ మందులను అందచేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ బి.పి,షుగర్ లు కేవలం మందుల వాడకంతోనే నియంత్రణలో ఉండవని, సరైన ఆహార నియమాలు పాటించాలని, ఒక్కపూట తప్పనిసరిగా తృణ ధాన్యాల వాడాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా.సత్య తేజ, డా.రాజేశ్వరి, డా.రవీంద్ర, డా.లక్ష్మణరావు, డా.శివాజీ, డా.నేతాజీ, వాహినీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్వి భాగం వాలంటీర్‌లు, జనవిజ్ఞాన వేదిక సభ్యులు వాలంటీర్ లుగా సేవలందించారు.

## కోల్‌కతా ఘటన బాధితులను
# కఠినంగా శిక్షించాలి



**కోడూరు మేజర్ న్యూస్:** ఇటీవల కోల్ కతా లోని ఆర్ జి కర్ మెడికల్ కళాశాల లోనీ ట్రైనీ వైద్యురాలి పై జరిగిన అత్యాచారం, హత్య ఘటన యావత్తు భారత్ దేశాన్ని కలిచి వేసింది. ఈ సంఘటన ను నిరసిస్తూ, ఆ సోదరి ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారంఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు జి.గోపిచంద్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు,మండలం లోని యువత ఎంఆర్వో ఆఫీస్ రోడ్డు వద్ద నుంచి ప్రధాన కూడలి వరకు ప్లకార్డులు,కొవ్వొత్తుల తో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. నిర్భయ, దిశా చట్టాలు ఉన్నప్పటికీ మహిళల పై జరుగుతున్న లైంగిక వేధింపులు, హత్యలు నివారించడానికి మన దేశం లో మరింత బలమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలి అంటే సమాజం లోని ప్రతి ఒక్కరూ తమ గళం విప్పాలని జిల్లా అధ్యక్షులు జి.గోపిచంద్ ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం అఘాయిత్యానికి గురైన విద్యార్థిని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రతి ఒక్కరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కె.సుబ్బారావు, కుమార్ తో పాటు సచివాలయ ఉద్యోగులు, కోడూరు మండల యువత పాల్గొన్నారు.

## సాయి చరిత శతకం ఆవిష్కరణ సభ




**మచిలీపట్టణం, మేజర్ న్యూస్ :** భారతీయ సాహిత్య పరిషత్-మచిలీపట్టణం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మచిలీపట్నం పోర్ట్ రోడ్డులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రముఖ రచయిత్రి పల్లావఝుల వెంకట శైలజ రచించిన సాయి చరిత శతకం ఆవిష్కరణ సభ జరిగింది. భారతీయ సాహిత్య పరిషత్ ఉపాధ్యక్షులు అంబటిపూడి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా, గ్రంథ ఆవిష్కర్తగా రాష్ట్ర మైన్స్, జియాలజి అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విచ్చేసి శతకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతి స్వీకర్తగా, గౌరవ అతిథిగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విచ్చేసి సాయి చరిత శతకం తొలి ప్రతి స్వీకరించారు. ఆత్మీయ అతిథిగా ఆర్.కే విద్యాసంస్థల అధినేత బండి రామకృష్ణ, గ్రంథ విశ్లేషకులుగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ, ఆత్మీయ అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, సాహితీ మిత్రులు లంకిశెట్టి బాలాజీ విచ్చేశారు. కార్యక్రమాన్ని భారతీయ సాహిత్య పరిషత్ - మచిలీపట్నం అధ్యక్షులు కారుమూరి రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి ముదిగొండ శాస్త్రి పర్యవేక్షించారు.

# మనీ ప్లాంట్ అదృష్టాన్నే కాదు డెంగ్యూను తెచ్చిపెడుతుంది





**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మనీ ప్లాంట్ చాలామంది ఇళ్లలో అదృష్టం కోసం, ఇంట్లో ధనం వృద్ధి చెందడం కోసం పెంచుకుంటారు. ఈ మొక్కను పెరట్లోనో, కుండీలలోనో పెంచాల్సిన అవసరం లేదు. దీన్ని ఒక చిన్న గాజు సీసాలో నీళ్లు పోసి అందులో ఉంచినా ఎంచక్కా పెరుగుతుంది. ఇంటికి అదనపు అలంకరణ కూడా ఇస్తుంది. అయితే మనీ ప్లాంట్ వల్ల ఇంట్లో ధనం వృద్ధి చెందడం, అదృష్టం కలిసిరావడం సంగతి పక్కన పెడితే ఇది అనారోగ్యాన్ని కలిగిస్తుందని అంటున్నారు. అదెలాగో దీని వెనుక కారణాలు ఏంటో తెలుసుకుంటే చాలామంది మనీ ప్లాంట్ ను ఒక చిన్న కంటైనర్ లేదా గాజు సీసాలో నీరు పోసి అందులో మొక్కను పెంచుతుంటారు. ఇది పడక గది, వంట గది, హాల్ ఇలా ఏ ప్రాంతంలో అయినా, చిన్న కిటికి లలో అయినా సులభంగా ఇమిడిపోతుంది. అయితే మనీ ప్లాంట్ లో పోసిన నీటిలో డెంగ్యు దోమలు అభివృద్ధి చెందుతాయనే విషయం బయటపడింది. ఇది ఈ వర్షాకాలంలో చాలా సులభంగా అనారోగ్యాన్ని చేకూరుస్తుందని వైద్యులు చెబుతున్నారు. గాజు సీసాలలో మనీ ప్లాంట్ లు పెంచేవారు వాటిలో నీరు పోసి మొక్కను పెంచుతుంటారు. ఇలాంటి వారు గాజు సీసాలలో నీటిని ఎప్పటికప్పుడు మారుస్తుండాలి. లేకపోతే ఈ నీటిలో డెంగ్యూ దోమలు వృద్ధి చెందుతాయి.

డెంగ్యూ లార్వాలు మనీ ప్లాంట్ నీటిలో ఏర్పడతాయి. నీటిని ఎప్పటికప్పుడు మార్చకపోతే ఈ లార్వాలు క్రమంగా వృద్ధి చెంది డెంగ్యూ దోమలు ఏర్పడతాయి. వాస్తవానికి మనీ ప్లాంట్ లో ఉండే నీరు చాలా స్వచ్ఛంగా ఉంటుంది. డెంగ్యూ లార్వా కూడా స్వచ్ఛమైన నీటిలో వృద్ధి చెందుతుంది. ఈ కారణంగా మనీ ప్లాంట్ లో ఇది వేగంగా వ్యాప్తి చెందుతుంది. మనీ ప్లాంట్ ను పడక గదిలోనూ, నిద్రించే ప్రాంతాలకు దగ్గర పెట్టుకోకుండా ఉండటం మంచిది. అంతే కాదు ఇంట్లో మనీ ప్లాంట్ పెంచేవారు ప్రతిరోజు నీటిని మార్చి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటీవల మేము చాలా జాగ్రత్తగా ఉంటాం డెంగ్యూ ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు అనేవారికి ఇంట్లో మనీ ప్లాంట్ మొక్కలు విపరీతంగా పెంచుతూ వాటి ద్వారా డెంగ్యూ దోమలు వృద్ధి చెందాయని తద్వారా ఇంటిల్లిపాది డెంగ్యూ బారిన పడటంతో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా చెంచా మంచినీరు ఉంటే చాలు డెంగ్యూ దోమలకు నివాసాలుగా మారుతాయి.

# దివ్యాంగురాలికి కృతిమ కాలు, ఆర్థిక సహాయం అందచేత



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** వైద్యుని నిర్లక్ష్యంతో ఎడమ కాలును కోల్పోయిన మహిళకు మచిలీపట్నం నవచైతన్య మదర్ తెరిసా సేవా సమితి ఆదివారం "కృత్రిమ కాలు"ను, ఏడు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. మచిలీపట్నం 50వ డివిజన్ గనిపిశెట్టి గోపాల్ నగర్ చెందిన నత్త శారద కుమారి(59) భర్త పోస్టల్ డిపార్ట్మెంట్ లో పనిచేసి చనిపోయారు. ఆమెకు నలుగురు ఆడపిల్లలు. డాక్టర్ యొక్క నిర్లక్ష్యం వల్ల శిక్షణ పొందని నర్సు ఇచ్చిన ఇంజక్షన్ వల్ల ఆవిడ కాలుకు పూర్తి ఇన్ఫెక్షన్ జరిగి ఎడమ కాలును మోకాలు వరకు తీసివేశారు. విషయం తెలుసుకున్న మదర్ తెరిసా సేవా సమితి సభ్యులు ఆమెకు అండగా నిలిచారు. ఆదివారం సమితి గౌరవ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అధ్యక్ష కార్యదర్శులు పైడిపాముల గురు ప్రసాద్ కుమ్మరి జలా చంద్రుడు, సమితి సభ్యులు పద్మనాభుని శేఖర్, లంకే నాంచారయ్య ఆదివారం దివ్యాంగురాలు ఇంటికి వెళ్లి 15 వేల రూపాయలు ఖరీదు చేసే కృత్రిమ కాలును అందజేశారు. ఆమెకు కావలసిన మందులు, ఫిజియోథెరపీ నిమిత్తం సమితి గౌరవ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ 5,000, కార్యదర్శి కుమ్మరి జలాచంద్రుడు 2,000 రూపాయలు నగదును అమె కుమార్తె సాహితి కి అందజేశారు. నిరీక్షణతో ఉన్న తమను గుర్తించి మదర్ తెరిసా సేవా సమితి చేయూత కి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సమితి గౌరవ అధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ దివ్యంగురాలకు ప్రభుత్వ పరంగా తక్షణమే 15,000 నెల వారీ పెన్షన్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. ఇతర స్వచ్ఛంద సంస్థలు పేద కుటుంబానికి సహాయం అందించాలని గురుప్రసాద్ కోరారు.



## మెగాస్టార్ జన్మదిన వారోత్సవ వేడుకలు

**నందిగామ, ఆగస్టు 18, మేజర్ న్యూస్:**పద్మ విభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని నందిగామ నియోజకవర్గ అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో జన్మదిన వారోత్సవాలను వివిధ సమాజ సేవా కార్యక్రమాల వారం రోజులపాటు నిర్వహిస్తున్నారు.ఈ వారోత్సవాలలో భాగంగా ఆదివారం పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత - శుభ్రత కార్యక్రమంగా నందిగామ పట్టణంలో చిన్న బ్రిడ్జి ప్రక్కన పోస్తున్న వ్యర్థాలు, వ్యర్థ ప్లాస్టిక్ కవర్లు, వెంట్రుకల కుప్పలు, ఇత్యాది వర్ధాలన్నింటినీ చీపుర్లతో కుప్పలు చేసి మొత్తం శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గ అధ్యక్షులు పోలిశెట్టి వరుణ్, చిరంజీవి యువత సభ్యులు కామిశెట్టి వెంకటేశ్వర రావు, పూజారి రాజేష్,షేక్ మొహమ్మద్, సింగంశెట్టి శ్రీనివాస్, కొంగర రామకృష్ణ, షేక్ అజారుద్దీన్, కొమ్మవరపు నరసింహస్వామి,సతీష్, కొత్తరాంగోపాల్, పాటి రాజేష్ పలువురు పాల్గొన్నారు.

## శ్రావణమాసంలో అధఃపాతాలంలోనికి చేరిన మాంసం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** శ్రావణమాసంలో శుభకార్యాలు, శ్రావణ శుక్రవారాలు, ముహుర్తాలు ఎక్కువగా ఉండటంతో మాంసం ప్రియులకు శుభవార్త అందింది. ఈ సంవత్సరం జనవరి నుండి కొండెక్కి కూర్చున్న కోడి ధరలు దిగి వచ్చాయి. శ్రావణమాసం రాకముందు 280 నుండి 320 వరకు అమ్మచూపిన చికెన్ నేడు 100 రూ॥ నుండి 140 రూ॥కు దిగిరావడంతో మాంసం ప్రియులకు శుభవార్త అయ్యింది. గత నెల వరకు చికెన్ ధరలు చూసి సామాన్య ప్రజలు తినలేక గుటకలు మింగి సరిపెట్టుకున్నారు. ఈ సంవత్సరం ప్రారంభం నుండి చికెన్ ధరలు చుక్కలు చూపిస్తూనే వచ్చాయి. శ్రావణ మాసం ప్రారంభంతోనే రోజుకో విధంగా చికెన్ ధరలు తగ్గుతూ వచ్చాయి. అందుకు కారణం ఈ నెల అంతా మహిళలు పూజలు, వ్రతాలు వంటి కార్యక్రమాలతో దైవారాధనతోనే గడుపుతారు. మహిళలు మాంసాహారాన్ని ఇంటికి రానివ్వరు. మగవారు నేరుగా చికెన్ తీసుకుని ఇంటికి వెళ్ళలేని పరిస్థితి. దీంతో హోటల్స్, రెస్టారెంట్‌లలో మాంస ప్రియులు అదును చూసుకుని లాగించేస్తూ ఉంటారు. ప్రస్తుతం శ్రావణమాసం కావడం ఇతర పూజలు ఉన్నందున 120 నుండి 140 రూ॥లకు చికెన్ ధరలు పడిపోయాయి. గత నెల వరకు 280 నుండి 320 రూ॥ వరకు కొనుగోలు చేసిన మాంసం ప్రియులకు మొత్తం మీద శుభవార్తే అయ్యింది.

## మోపిదేవి సుబ్రహ్మణ్యేస్వర స్వామి ఆలయంలో మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక పూజలు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** సుభిక్షమైన రాష్ట్రాన్ని సాకారం చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేస్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఘన స్వాగతం పలికారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభివృద్ధిలో దేశంతో పోటీ పడేలా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి దైవ ఆశీస్సులు అందించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ అర్చకులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి ఆశీర్వదించారు. ఆలయంలోని కళ్యాణ మండపంలోని నూతన వధూవరులుతో మంత్రి కొల్లు రవీంద్ర ముచ్చటించారు. నూతన జీవితంలో అడుగుపెడుతున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## సైడ్ డ్రైన్‌లలో డి సిల్టింగ్ చేయించండి

**కమిషనర్ ధ్యానచంద్ర**





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** తరచుగా డి సిల్టింగ్ చేస్తూ సైడ్ కాలువల్లో మురుగు నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తన పర్యటనలో అధికారులను ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర తన పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, మదర్ తెరేసా జంక్షన్ ప్రాంతాలు పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిశుద్ధ నిర్వహణ మెరుగుపరచాలని, తరచుగా సైడ్ డ్రైన్‌లలో డి సిల్టింగ్ పనులు చేస్తూ మురుగునీటి ప్రవాహానికి ఎటువంటి అడ్డు లేకుండా చూసుకోవాలని, ఏదైనా ఆటంకాలు గమనిస్తే వెంటనే తగు చర్యలు తీసుకొని మురుగునీరు సక్రమంగా అయ్యేటట్టు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతోపాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం పాల్గొన్నారు.

## ఘనంగా కొమ్మి ప్రసాద్ జన్మదిన వేడుకలు



**నందిగామ, ఆగస్టు 18, మేజర్ న్యూస్:** పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త, తెలుగుదేశం పార్టీ నాయకులు కొమ్మి ప్రసాద్ జన్మదిన వేడుకలు మిత్ర బృందం ఘనంగా నిర్వహించారు. ప్రసాద్ కు శాలువాతో సత్కరించి కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పేదలకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త నర్వనేని మురళి, కొటారు నరసింహారావు, కొంగర బ్రహ్మం, గోపి, నరేష్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు

17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999